క్లుప్తంగా

సోమేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే విష్ణు



విద్యాగణపతి స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక సోమేశ్వర స్వామి వారిని, విద్య గణపతి స్వామిని విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి



ఎన్నార్పీ అగ్రహారంలో కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ వద్ద, ఉండి బస్టాండ్ సమీపంలోను ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మిరియాల రవిబాబు కళాజాత బృందం ప్రదర్శనలిచ్చారు.ఈ సందర్భంగా వారు ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

సీసలిలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో సచివాలయం వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. భీమవరం సాయి ఇండియన్ హాస్పటల్ ఆధ్వర్యంలో గణేష్న శ్రీ రాంబాబు కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఉచిత వైద్య మెగా వైద్య శిబిరం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ బిళ్ళకుర్తి ధనలక్ష్మి, ఉపసర్పంచ్ బాతు మాణిక్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు మెళ్లం రంగారావు, జగదీశ్వరీ, సలాది మహేష్ తదితరులు వైద్య సేవలు అందించారు. సుమారు 300 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు.

నేడు రైతు, కార్మిక నిరసన ప్రదర్శన

భీమవరం: వ్యవసాయ రంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు సోమవారం నిరసన ప్రదర్శన చేయనున్నట్టు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సీఐటీయూ స్థానిక కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ మాట్లాడారు.

శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయం



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న పివియల్, పాతపాటి వాసు

కాళ్ల: దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు గ్రామంలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో వృద్ధులకు వికలాంగులకు ఇంటింటా ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేసేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. నిరుపేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వికలాంగునికి ట్రై సైకిల్ ను వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం గ్రామంలో పలువురు పెద్దలు వేగేశ్న సుబ్బరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజు లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యు నిపుణులు డాక్టర్ సీలాద్రిరాజు, మాజీ ఎంపీపీ వేగేశ్న గోపాలకృష్ణంరాజు, అడ్డాల నాగరాజు, వేగేశ్న రవితేజ, వేగేశ్న సుబ్బరాజు, గాదిరాజు వెంకటసుబ్బరాజు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో అజ్జమూరు గ్రామంలో నిర్మించిన భారీ పక్కా డ్రెయిన్(ఫైల్)



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు(ఫైల్)

- గడపగడపకూ పథకంలో 264 డ్రెయిన్లు, రోడ్లు నిర్మాణం
- రూ. 7.03 కోట్లతో పనుల పూర్తి

నియోజకవర్గంలో జరిగిన పనులు

పనులు	మొత్తం	పూర్తైనవి	నిర్మాణంలో ఉన్నవి	ప్రారంభించాల్సినవి	నిధులు(కోట్లలో)
సీసీ రోడ్లు	185	131	54	00	3.76
పక్కా డ్రెయిన్లు	79	50	10	19	3.27
మొత్తం	264	181	64	19	7.03

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీ సమస్యలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో చెక్ పడింది. నియోజకవర్గంలో 76 గ్రామాలకు గాను గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు, మండల స్థాయి అధికారులకు స్థానిక సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. ఆయా సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యతా క్రమంలో నియోజకవర్గంలో 264 డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదలను పంపారు. రూ.7.03 కోట్ల వ్యయంతో ఆయా పనుల్ని దశల వారీగా పూర్తి చేశారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం

గ్రామాల్లో మట్టి రోడ్లు, రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తూ అసౌకర్యానికి గురి చేయడమే కాకుండా ప్రజలను అనారోగ్య పాలు చేస్తున్నాయి. బురదలో నడుస్తూ, దుర్వాసన పీలుస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సంఘటనలను గత పాలకులు పట్టించుకోలేదు. దుర్గంధపూర్తిమైన వాతావరణంలోనే ఓట్లు అభ్యర్థించి గెలిచిన తరువాత సమస్యలను పెడచెవిన పెట్టారని పలువురు స్థానికులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పీవీఎల్ నర్సింహరాజుకు వివరించారు. దీంతో ఆయన స్పందించి వెంటనే ఆయా ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్లను నిర్మించేందుకు నిధులు కేటాయించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సీఎం జగన్‌కు, నర్సింహారాజుకు ధన్యవాదాలు చెబుతున్నారు.

అన్ని రోడ్ల అభివృద్ధికి రూ. 150 కోట్లు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం, ఇతర నిధులన్నింటితో నియోజకవర్గంలో రూ. 150 కోట్లతో రోడ్లు అభివృద్ధి పరచాం. గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యల్ని తెలుసుకుని తక్షణం పరిష్కరించేందుకు ఆయా ప్రాంతాలకు నిధులు కేటాయించాం. సచివాలయ పరిధిలో రూ. 20 లక్షల కేటాయించి, తీర్మానం చేయడంతో పనుల్ని వేగంగా పూర్తి చేయించాం. గడపగడప నిధులు రూ.7.03 కోట్లతో 264 పనులు చేపట్టాం.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

కాలనీల్లో రోడ్లు వేశాం



మండలంలోని దుంపగడప గ్రామంలోని తిమ్మరాజు కాలనీ, బోసు కాలనీ, పల్లె పాలెంలో సిమెంట్‌రోడ్లు, గ్రామాలోని అబ్బన్న వీధిలో డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 20 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన పీవీఎల్ నర్సింహరాజుకు ధన్యవాదాలు చెబుతున్నారు.

– కొట్టు మాణిక్యాలరావు, దుంపగడప

ఎన్నికల హామీలన్నీ అమలు చేశాం

- విశ్వసనీయతకు నిలువుటద్దం సీఎం జగన్
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



శ్రీనివాస్‌తో మోటుపల్లి గంగాధర్‌రావు చిత్రంలో పీవీఎల్, పాతపాటి



విప్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు చెబుతున్న గుబ్బల శ్రీనివాస్

భీమవరం: గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడుగా నియమితులైన ఆకివీడుకు చెందిన మోటుపల్లి గంగాధర్‌రావు ఆదివారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాజకీయాల్లో విశ్వసనీయతను తిరిగి నెలకొల్పిన ముఖ్యమంత్రి జగన్ ఒక పక్క అభివృద్ధితో, మరో పక్క సంక్షేమంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఆకివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పుప్పాల పండు, ఇల్లా రాదా, వేగిరాము, విజ్జురోతి విజయకుమార్, వాడపల్లి జగన్ ,కొటికలపూడి ప్రసాద్, అంబటి రమేష్ ,మారా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతుందని ప్రభుత్వ విప్ శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ వీరవాసరం మండలం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గుబ్బల శ్రీనివాస్ ఆదివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారని అన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో సైనికుల్లా పనిచేసి పార్టీని అత్యధిక మెజార్టీ సీట్లతో అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీరవల్లి రాధాకృష్ణ, చుండూరి ముసలయ్య, గుడాల అయ్యవార్లు, రేవు నాగరాజు,వేంద్ర నాగరాజు, కట్టా తిరుపతిరావు, నాగేంద్ర పాల శ్రీను, బొక్కా నాగేశ్వరరావు, పాల కృష్ణ, బొక్క నాగేశ్వరరావు, పిల్లి కృష్ణ, బొక్కా శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోషేన్‌రాజును కలిసిన గంగాధర్



మోషేన్‌రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మోటుపల్లి గంగాధర్

భీమవరం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన మోటుపల్లి గంగాధరరావు ఆదివారం సాయంత్రం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఉండి నియోకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, గోకరాజు రామం, ఏఎస్ రాజు, జామి హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజలు



గుమ్ములూరులో వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: అభివృద్ధి పనుల కోసం కొబ్బరికాయ కొట్టిన నెల రోజుల్లోనే పనిని బట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుని భూమి పూజ చేస్తున్నానని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోనూ, స్థానిక పట్టణంలోనూ ఆదివారం విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి, టెండర్లు పూర్తి చేసి, వర్కు ఆర్డర్ వచ్చిన తరువాత భూమి పూజ చేసి కొబ్బరికాయ కొడుతున్నాని చెప్పారు. నియోజకవర్గంలో గత 58 నెలల నుంచి తాను కొబ్బరికాయ కొట్టిన పని ఒక్కటీ ఆగలేదన్నారు. పకడ్బందీగా పనులు నిర్వహించడం వల్లే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మండలంలోని గుమ్ములూరు గ్రామంలో చినకాపవరం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి రూ. 60 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. దీనిలో రూ.25 లక్షలు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు ఇచ్చారని నర్సింహరాజు తెలిపారు. గ్రామంలో జెడ్పీటీసీ, ఎంపీపీ నిధులు రూ. 16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో రూ.3.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 12వ వార్డులో రూ. 6.25 లక్షలతో సీసీ రోడ్లు, 15వ వార్డులో రూ. 4 లక్షలతో సీసీ డ్రెయిన్, 16వ వార్డులో రూ. 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, 18వ వార్డులో రూ. 7.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆయన వివరించారు. పట్టణంలో మొత్తం రూ. 29.42 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నర్సింహరాజు చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరి కాయలు కొడుతున్నారనే అనుమానాలు వద్దని, భూమి పూజ చేసిన పనులన్నింటిని నెలలో పూర్తి చేస్తారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల కిషోర్ రెడ్డి, భీమవరం ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్‌జామి హైమావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అన్యెం కృష్ణ, యువజన విభాగం మండల అధ్యక్షుడు చిక్కాల రామాంజనేయులు(చిన్నా), వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. ఈ మేరకు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వసుధ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరం లోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి,2ఈ ఎకో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అందరి మన్ననలు పొందడం అభినందనీయం



బొండాడ గ్రామంలో నాగరాజును సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ మల్లికార్జునరావు

కాళ్ల: గ్రామంలో అన్ని వర్గాల వారిని కలుపుకునీ వెళ్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందటం అభినందనీయమని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల వెంకట మల్లికార్జున రావు తెలిపారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మల్లికార్జునరావు ఉండి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నే నాగరాజు, జనార్ధనస్వామి భోగేశ్వర స్వామి ఆలయాల కమిటీ నూతన చైర్మన్లు కేవీఆర్ సూర్యనారాయణ, మందపాటి రాము తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామంలోని జనార్ధనస్వామి భోగేశ్వర స్వామి ఆలయాల నూతన కమిటీ ఏర్పాటుకు మన్నే నాగరాజు ఎంతో కృషి చేశారన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సూచనలు, సలహాలతో గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వేగేశ్న ఆంజనేయరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మన్నె శ్రీనివాస్, మందపాటి రవి, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు



గూట్లపాడులో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కంటి సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు అన్నారు. భీమవరం మండలం గూట్లపాడు గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లకు వ్యాధులు సోకితే వెంటనే వైద్యుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలని లేకుంటే అంధత్వం ఆవహిస్తుందని వెంకటపతిరాజు హెచ్చరించారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, పలువురికి ఉచితంగా మందులు, కళ్ల జోళ్ల అందజేశామని, 10 మందికి కంటి శస్త్రచికిత్సల నిమిత్తం రాజమండ్రిలోని వేమగిరిలో పరమహంస యోగానంద నేత్రాలయకు సిఫారసు చేశామని సంస్థ డైరెక్టర్ ఇందుకూరి ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నరసింహమూర్తి (చినబాబు), సర్పంచ్ ఒడుగు ముత్యాలరాజు, కొప్పినీడి ఆదినారాయణ, తిరుమాని నాగరాజు, వడ్డి వెంకటేశ్వరరావు, కేవీవీ సత్యనారాయణ, చెలంకూరి శివహనుమాన్ ప్రసాద్, జవ్వాది గణేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి సింపోజియంలు దోహదం



సింపోజియంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు

భీమవరం: వివిధ ఇంజినీరింగ్ బాడీల్లో ప్రాతినిధ్యం పొంది, వాటి నిర్వహణలో పరిణితి చెందితే ఉన్నత చదువులతో పాటు మంచి అవకాశాలు పొందవచ్చని ఎస్ఆర్‌కేఆర్ పూర్వవిద్యార్థి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్శిటీ సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎ.ఉమామహేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ హెడ్ ఏసీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన సూపర్ నోవా 2కే24 పేరిట నిర్వహించిన జాతీయస్థాయి విద్యార్థి సింపోజిఎంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఇంజినీరింగ్ చదివిన రోజుల్లో వివిధ బాడీల్లో పని చేయటం వల్ల విదేశాలకు వెళ్లి కూడా పరిశోధనలు చేసి తదనంతరం పరిశోధనాత్మక అంశాలపై విశ్లేషణ చేయడం వల్ల ఎంతో విజ్ఞానాన్ని అందుకోగలిగానని, అందుకు సింపోజిఎంలు దోహదపడ్డాయని వివరించారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ రైల్వే, ఓఎన్‌జీసీ, ఇతర ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్లకు సలహాలు సూచనలు అందిస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీ కృష్ణమరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు చక్కని వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్స్ పీపీ రామకృష్ణంరాజు, వి.రామరాజు, డాక్టర్ ఎస్.లవకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.


ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత

మొగల్తూరు: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, మానసిక ఉత్తేజం కలుగతాయని జిల్లా స్పిరిచ్యువల్ సొసైటీస్ అధ్యక్షుడు రుద్దిరాజు పెద్దివర్మ తెలిపారు. ఆదివారం కేపీ పాలెం తీరంలోని పాండు రంగ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సామూహిక ధ్యాన మహా యజ్ఞ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి ఒడిలో, సాగర నదీ పరివాహక ప్రాంతాలలో సామూహిక ధ్యానం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలైన యువతలకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న చిత్రప్రదర్శన



చిత్రాలు గీస్తున్న కళాకారులు



కళాకారుడు గీసిన చిత్రం

భీమవరం: స్థానిక మారుతి టాకీస్ సెంటర్లో ఉన్న అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన చిత్ర కళా సంబరం ఆర్టిస్ట్ వర్క్‌షాప్ సందర్శకులను ఆకట్టుకుంది. ఉభయ రాష్ట్రాల నుంచి 95 మంది చిత్రకారులు హాజరై లైవ్‌లో చిత్రాలను గీశారు. అకాడమీలోనే అప్పటికప్పుడు వేసి, తరువాత పోటీకి ప్రదర్శనకు ఉంచారు. ఇందులో భీమవరం ముఖచిత్రం, ఆక్వా రాజధాని, పంచారామ క్షేత్రం, కోడి పందేలు, ఎల్లాప్రగడ సుబ్బారావు, మావృక్షవార్ని ఆరాధించటం, మగువ అందమైన చూపులు, కౌమార దశ బాలిక ఆహార్యం, పల్లెటూరి వాతావరణం, గోదావరి తీరం, పంచారామ క్షేత్రమహాశివుడి ఆహార్యం, ప్రకృతి తదితర చిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. వర్క్ షాప్‌ను వదరాజు ముత్తరాజు ఆనంద్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని కళలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. కళలకు పుట్టినిల్లు పశ్చిమగోదావరి జిల్లా అని కళకారులు పేర్కొన్నారు. దాతల సహకారంతో భవనాన్ని నిర్మించారని, ప్రతి ఆదివారం ఉచితంగా చిన్నారులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, కాగిత వెంకటరమణ, గ్రంధి వెంకట్రావు, గోపా సత్యనారాయణ, అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి వెంకటరావు, కోశాధికారి గోపా సత్యనారాయణ, నల్లం వీరాస్వామి, డీవీఎస్ చంద్రజి, రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి: మండలంలోని చెరుకువాడ శివారులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకువాడ శివారు ఉండి కాలువలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం కనిపించడంతో స్థానిక వీఆర్వో వెంకటదుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కాలువ నుంచి మృతదేమాన్ని బయటకు తీశారు. అయితే మృతదేహం గుర్తు పట్టేందుకు కొంత ఇబ్బందిగా ఉందని మృతదేహంపై నల్లచారలు, పూలతో ఉన్న చొక్కా, నల్ల ప్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతునికి 35 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులు తెలియజేయాలని కోరారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.